క్లుప్తంగా

చౌడేశ్వరీదేవికి బోనాలు


రామకోటిలో చౌడేశ్వరిదేవికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పెద్దపప్పూరు: మహాలయ పౌర్ణమి సందర్భంగా మండలంలోని పెద్దపప్పూరు, రామకోటి, నరసాపురం గ్రామాల్లో చౌడేశ్వరిదేవి అమ్మవారికి తొగట వీర క్షత్రియులు బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఏటా అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని రామకోటి కాలనీవాసులు అన్నారు. భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

వైభవంగా నారాయణుడి కల్యాణం


ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

పెద్దపప్పూరు: మండలంలోని చిన్నపప్పూరు గ్రామ సమీపంలో పెన్నానది ఒడ్డున వెలసిన అశ్వర్థనారాయణ స్వామి క్షేత్రంలో పౌర్ణమి సందర్భంగా స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. అర్చకులు సునీల్‌కుమార్‌శర్మ, సుధీర్ కుమార్ శర్మ, బాలసుబ్రమణ్యశర్మ తదితరులు స్వాముల మూలవిరాట్లను పట్టువస్త్రాలతో ముస్తాబు చేసి కల్యాణోత్సవం చేపట్టారు. అనంతరం ఉత్సవ మూర్తులను ఆలయ ప్రాంగణంలో పల్లకీలో ఊరేగించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కాగా గ్రహణం సందర్భంగా మధ్యాహ్నానికే ఆలయాన్ని మూసివేసినట్లు ఈఓ సుబ్రమణ్యం తెలిపారు.

బాలుడి అప్పగింత


బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న యాడికి పోలీసులు

యాడికి: తప్పిపోయిన బాలుడిని పోలీసులు గంటలోపే తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన ఆదివారం యాడికి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పుట్లూరు మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన రామ్మోహన్, సునీతకు 6 సంవత్సరాల కుమారుడు కృష్ణ కుమార్ ఉన్నాడు. వారు కుమారుడితో కలిసి యాడికి గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చారు. ఆదివారం ఉదయం బాలుడు ఆడుకుంటూ ఇంటి నుంచి తప్పిపోయి తిరునాంపల్లి వద్ద రోడ్డులో ఏడుస్తున్నాడు. అదే సమయంలో అటుగా పోతున్న ఓ వ్యక్తి బాలుడిని తీసుకువచ్చి యాడికి పోలీస్టేషన్‌లో అప్పగించాడు. హెడ్‌కానిస్టేబుల్ రాజశేఖర్ రెడ్డి, పోలీసు మహమ్మద్ బాషా.. బాలుడి తల్లిదండ్రులను గుర్తించి వారికి అప్పగించారు. బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

పెద్దమ్మ తల్లికి పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

యాడికి: మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి ఆదివారం భాద్రపద మాస పౌర్ణమి పూజలు అత్యంత ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి, మొక్కుబడులు చెల్లించుకున్నారు. అలాగే మండల కేంద్రంలోని ఆర్య వైశ్యుల వీధిలో ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి శాలలో 11 జంటల దంపతులు శ్రీరామ సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆచరించారు.

పశువైద్యశాలకు మరమ్మతులు చేయరూ..


వర్షానికి కారుతున్న పశువైద్యశాల

యల్లనూరు: వర్షం వస్తే పశు గ్రాసం విత్తనాలు, మందులు నానిపోవాల్సిందే. మండల కేంద్రంలోని పశువైద్యశాలకు మరమ్మతులు చేయడంలో అధికారులు విఫలమయ్యారు. పశువైద్యశాలకు కేటాయించిన పరికరాలు, మూగజీవాల మందులు, గ్రాసం వంటివి నిల్వ ఉంచుకోలేక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. అసలే వర్షాకాలం.. వర్షం వస్తే ఏమవుతోందోనని పశువైద్యశాల లైవ్ స్టాక్ అసిస్టెంట్ రేష్మ, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాసరెడ్డి అవస్థ పడుతున్నారు. ఎంత మంది అధికారులు మారినా .. పశువైద్యశాల మెరుగుపడటంలేదు. ఉన్నతాధికారులు స్పందించి యల్లనూరు పశువైద్యశాలకు మరమ్మతులు చేయాలని మండలవాసులు కోరుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా



ప్రారంభానికి నోచుకోని జూనియర్ కళాశాల భవనం

పుట్లూరు: అధునాతన పద్ధతిలో అన్ని హంగులతో నిర్మించిన జూనియర్ కళాశాల భవనం ప్రారంభానికి నోచుకోక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. భవనం లోపలి భాగంలో ముళ్ల పొదలు పెరిగిపోయాయి. 2012-2013లో శింగనమల ఎమ్మెల్యే, ప్రాథమిక విద్యాశాఖ మంత్రి సాకే శైలజానాథ్ ప్రత్యేక నిధులు రూ.కోటి వ్యయంతో జూనియర్ కళాశాలను మంజూరు చేయించారు. అయితే నిర్మాణం పూర్తయినా భవనం ప్రారంభానికి నోచుకోలేదు. జూనియర్ కళాశాల ఏర్పాటు కోసం రూ.కోటితో నిర్మించిన ఈ భవనాన్ని ఎంపీడీఓ కార్యాలయం కోసం వినియోగిస్తామని ఒకరు.. వ్యవసాయ గోడౌన్‌గా వినియోగిస్తామని మరొకరు.. విద్యార్థుల వసతి గృహం కోసం వినియోగంలోకి తీసుకొస్తామని ఇప్పటి పాలకులు చెబుతున్నారు. కానీ ఆచరణ కావడం లేదు. జూనియర్ కళాశాల ప్రారంభానికి నోచుకోకపోవడంతో రూ.కోటి నిరుపయోగంగా మారింది. దీంతో మండలంలోని విద్యార్థులు ఇంటర్ చదవటానికి తాడిపత్రి, అనంతపురం తదితర పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా కొన్నేళ్ల క్రితం ఈ భవనంలో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం అప్పట్లో సంచలనంగా మారింది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి కళాశాల భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థులు, ప్రజలు కోరుతున్నారు.

వాహనాలున్నా.. ఉపయోగం సున్నా

పెద్దపప్పూరు: చెత్తతో సంపద తయారీ కేంద్రాలకు చెత్తను తరలించడానికి మంజూరైన వాహనాలు నిరుపయోగంగా మారాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనాలు శిథిలావస్థలకు చేరుకుంటున్నాయి. మండల కేంద్రంలోని చెత్తను తరలించడానికి ఏడాది క్రితం ప్రభుత్వం ట్రాలీ లేని ట్రాక్టర్‌ను మంజూరు చేసింది. ట్రాలీ లేకపోవడంతో ఎంపీడీఓ కార్యాలయంలో దిష్టిబొమ్మలా పడి ఉంది. ఇదిలా ఉండగా గత ప్రభుత్వ హయాంలో ఇంటింటి చెత్త సేకరణ కోసం చార్జింగ్ వాహనం మంజూరైంది. గత కొద్ది నెలలుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో పాత తహసీల్దార్ కార్యాలయం ఎదుట తుప్పుపట్టిపోతోంది. చాలా గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించకుండా ఎక్కడపడితే అక్కడ వేసి కాల్చి పడేస్తున్నారు. ఇలాగైతే సంపద సృష్టి ఎలాసాధ్యమవుతుందని మండల ప్రజలు అధికారులపై విమర్శలు కురిపిస్తున్నారు. నిరుపయోగంగా మూలనపడ్డ వాహనాల గురించి ఈఓఆర్‌డీ సురేష్‌ను సాక్షి ఫోన్‌లో ప్రస్తావించగా జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపామని సమాధానమిచ్చారు.


చెత్త సేకరణకు మంజూరైన ట్రాలీ లేని ట్రాక్టర్


మరమ్మతులకు నోచుకోక మూలనపడిన చార్జింగ్ వాహనం

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యువల్ చేయాలి


పాదయాత్రకు మద్దతు తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

గార్లదిన్నె: కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్సును వెంటనే రెన్యువల్ చేయాలని ప్రజా ఉద్యమ నేత సాకే గోవిందు కోరారు. సేవ్ ఆర్డీటీ అనే నినాదంతో ఆయన చేపట్టిన పాదయాత్ర ఆదివారం మూడో రోజు గార్లదిన్నెకు చేరుకుంది. పాదయాత్రకు అనంతపురం డివిజన్ ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు లోలూరు కుళ్లాయప్ప, దళిత సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్సును రెన్యువల్ చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కదిరెప్ప, పుల్లన్న, సునీత, ఆదిలక్ష్మి, నరసింహులు, రామాంజనేయులు, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


చికిత్స పొందుతున్న డ్రైవర్ బాషా

గుత్తి: పట్టణ శివారులో ఆదివారం ఓ లారీ డ్రైవర్ డ్రైవ్ చేస్తున్న సయమంలో ఉన్నఫళంగా తలనొప్పి రావడంతోపాటు కళ్లు తిరిగాయి. దీంతో డ్రైవింగ్ బ్యాలెన్స్ తప్పింది. అయితే డ్రైవర్ చాకచక్యంగా లారీని రోడ్డు పక్కకు తీసుకెళ్లి నిలిపివేశాడు. దీంతో పెను ప్రమాదం తప్పింది. వివరాలు.. అనంతపురానికి చెందిన బాషా ఆదివారం కర్ణాటక నుంచి లారీలో జేసీబీని లోడ్ చేసుకుని సింహాద్రి పురానికి బయలుదేరాడు. అయితే గుత్తి సమీపంలోకి వచ్చాక విపరీతంగా తలనొప్పి, కళ్లు తిరిగాయి. దీంతో అతి కష్టం మీద లారీని రోడ్డు పక్కకు తీసుకెళ్లి ఆపాడు. స్థానికులు గమనించి లారీ డ్రైవర్ బాషాను గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రాయితీపై జిప్సం

శింగనమల: మండలానికి 30 మెట్రిక్ టన్నుల జిప్సం వచ్చిందని, 28.6 శాతం రాయితీ పంపిణీ చేస్తామని ఏఓ అన్వేష్‌కుమార్ ఆదివారం తెలిపారు. 50 కిలోల బస్తా ధర రూ.262.20 కాగా, రాయితీ రూ.75 పోను రైతులు 187.20 చెల్లించాలన్నారు. ఒక రైతుకు గరిష్టంగా 4 బస్తాలు పంపిణీ చేస్తామన్నారు. జిప్సం కావల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ నంబరు, మొబైల్ నంబరు తో శింగనమల రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

అన్నదాతల నడ్డి విరిచిన ‘కూటమి’


గుంతకల్లులో అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి


తాడిపత్రిలో అన్నదాత పోరు పోస్టర్ విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

గుంతకల్లుటౌన్: ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వం.. అన్నదాతలను సైతం ఘోరంగా మోసగించిందని గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గం సమన్వయకర్త వై.వెంకటరామిరెడ్డి విమర్శించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతన్నలకు అండగా ఈ నెల 9న స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద నిర్వహించనున్న అన్నదాత పోరుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైవీఆర్ మాట్లాడుతూ రైతులకివ్వాల్సిన యూరియాను కొందరు పచ్చ పార్టీ నేతలు బ్లాక్‌మార్కెట్‌కు తరలించి సొమ్ముచేసుకున్నారన్నారు. యూరియా సహా రైతులకు అవసరమైన ఎరువులను వెంటనే పంపిణీ చేయాలని, బ్లాక్‌మార్కెట్‌ను నియంత్రించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్న డిమాండ్‌లతో ఈ నెల 9న రైతులకు మద్దతుగా అన్నదాత పోరు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు స్థానిక పార్టీ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకూ బైక్ ర్యాలీగా వెళ్లి.. అక్కడ నిరసన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గం నుంచి పార్టీశ్రేణులు, రైతన్నలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జింకల రామాంజనేయులు, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు ఖలీల్, రాము, రైతు విభాగం నియోజకవర్గం అధ్యక్షుడు బాబూరావు, పట్టణ, మండల అధ్యక్షులు జగదీశ్వర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, అనుబంధ సంఘాల నియోజకవర్గం అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: రైతున్నలకు బాసటగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 9న చేపట్టనున్న అన్నదాత పోరుకు పెద్ద ఎత్తున తాడిపత్రి నియోజకవర్గ రైతులు తరలి రావాలని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం తాడిపత్రిలోని తన నివాసంలో ఆయన అన్నదాత పోరు పోస్టర్లను పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి విడుదల చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులకు తిప్పలు తప్పడం లేదన్నారు. యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలించి టీడీపీ నాయకులు, డీలర్‌లు కుమ్మక్కై రెట్టింపు రేట్లకు అమ్ముకుంటు రైతులను నిలువునా దోచుకుంటున్నారన్నారు. కూటమి మెడలు వంచైనా రైతులకు న్యాయం జరిగేలా పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కంచం రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రామూర్తిరెడ్డి, ఎంపీటీసీ రవికుమార్, వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ కార్యదర్శి ప్రభుకుమార్, నియోజకవర్గ చేనేత అధ్యక్షుడు గడ్డం పరమేష్, రవితేజరెడ్డి, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

శింగనమల: రైతులు సమస్యలు పరిష్కరించండంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. ఆదివారం శింగనమలలో నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ ఆదేశాల మేరకు అన్నదాత పోరు పోస్టర్లను వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పూల ప్రసాద్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు వై. నారాయణరెడ్డి మాట్లాడుతూ ఈనెల 9న అన్నదాత పోరు కార్యక్రమం రెవెన్యూ డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణరెడ్డి, మాజీ డీసీఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి, జెడ్పీటీసీ భాస్కర్, వైఎస్సార్‌సీపీ మండలాల అధ్యక్షులు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, ఎల్లారెడ్డి, ఖాదర్‌వలి, మల్లీశ్వర్‌రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు నాయక్, జిల్లా అధికార ప్రతినిధి ఎన్‌వి నారాయణ, సర్పంచ్‌లు గోపాలురెడ్డి, వెంకటరాముడు , మండల కో–ఆప్షన్ మెంబరు అలీ, సీనియర్ నాయకులు సుధాకర్‌రెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఫణీంద్ర, మహిళా నాయకురాలు పసుపులేటి పద్మావతి, శకుంతలమ్మ, శివమ్మ, బండి శ్రీనివాసులు, గురుమూర్తి రెడ్డి, వరికూటి కాటమయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


శింగనమలలో అన్నదాత పోరు పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

‘మహాసభలను జయప్రదం చేయండి’

పామిడి: పట్టణంలోని గుత్తిరోడ్డులో ఉన్న అంబేడ్కర్ భవన్‌లో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే ఏపీ రైతుసంఘం 9వ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం నాయకుడు పి.అనిమిరెడ్డి ఆదివారం కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలపై సమీక్షించే ఈ మహాసభలకు రైతులు పెద్దఎత్తున తరలిరావాలన్నారు.

కళాకారుడికి సత్కారం


మాల్యవంతం నారాయణ స్వామిని సన్మానిస్తున్న తేనె తెలుగు కల్చరల్ సభ్యులు

శింగనమల(నార్పల): నార్పల మండలంలోని బి.పప్పూరు గ్రామానికి చెందిన సీనియర్ కళాకారుడు, హార్మోనిస్టు మాల్యవంతం నారాయణస్వామిని తేనె తెలుగు కల్చరల్ చారిటబుల్ నిర్వాహకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. చారిటబుల్ వ్యవస్థాపకుడు అంజినప్ప, గౌరవ అధ్యక్షుడు సామవేదం బాలసుబ్రహ్మణ్యం, డైరెక్టర్ సాయి, కార్యదర్శి బొగ్గు రవి తదితరులు పాల్గొన్నారు.

ముట్టడి జయప్రదం చేయండి


కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

పామిడి: కార్మికుల సంక్షేమ పథకాల అమలు కోసం ఈ నెల 15న సీపీఎం ఆధ్వర్యంలో విజయవాడలో చేపట్టిన లేబర్ కమిషనర్ కార్యాలయ ముట్టడి కార్యక్రమం జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు పి.అనిమిరెడ్డి కోరారు. ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో ముట్టడి కార్యక్రమ కరపత్రాలను విడుదల చేశారు. 14వ తేదీ రైలులో వెళ్లే చలో విజయవాడ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా కార్మికులు కదలిరావాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు, మల్లేసు, ముత్యాలు, చంద్రబోసు, మాబు, లక్ష్మణ్‌కుమార్, నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

‘కోటంక’లో ప్రత్యేక పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ఆదివారం ఆలయ ప్రధాన అర్చకుడు రామాచార్యులు అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సౌకార్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

చర్చీల్లో ఆరాధనోత్సవం


సీఎస్‌ఐ చర్చిలో ప్రసంగిస్తున్న పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్

పామిడి: మండలంలోని అన్ని చర్చీలలో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్‌ఐ చర్చిలో నిర్వహించిన కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ ప్రసంగించారు. దేవునిపై భయభక్తులు కలిగియుండుట జ్ఞానానికి మూలమన్నారు. క్రీస్తుతోనే నిత్యజీవం ప్రాప్తిస్తుందన్నారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు వీరయ్య, జయరాజు, హోసన్న, రత్నరాజు, బుజ్జిబాబు, దేవదాసు, కరుణాకర్, వరప్రసాద్, రని, పాస్టరమ్మ సువర్ణమ్మ, మంజులమ్మ, సుశీలమ్మ, ప్రిస్కిల్లా, డాక్టర్ కమల, రేచెల్, వాణి, లత, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

‘అన్నదాత పోరు’ను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు నారాయణ రెడ్డి

గార్లదిన్నె: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 9న అనంతపురంలో నిర్వహించే రైతు పోరు కార్యక్రమం జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి కోరారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు ఎరువుల సరఫరా సక్రమంగా చేయడం లేదన్నారు. ప్రభుత్వం రైతు సమస్యలపై నిద్ర మత్తులో ఉందన్నారు. రైతు సమస్యలపై మంగళవారం ఉదయం 9 గంటలకు అనంతపురం జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకూ నిరసన ర్యాలీ ఉంటుందన్నారు. కార్యక్రమానికి గార్లదిన్నె మండలంతోపాటు జిల్లాలోని వివిధ మండలాలు నుంచి రైతులు,నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘం నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎల్లారెడ్డి, శింగనమల నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు పుల్లారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యాడికి: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 9న అనంత పురంలో చేపట్టనున్న రైతు పోరుబాట కార్యక్రమానికి మండలంలోని రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లి విజయ వంతం చేద్దామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వెంకట రామి రెడ్డి, మండల కన్వీనర్ సంజీవ రాయుడు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పుట్లూరు: ఈ నెల 9న అనంతపురంలో వైఎస్సార్‌సీపీ నిర్వహించే ‘రైతు పోరు’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ పి.మహేశ్వరరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ప్రజా సమస్యల వేదికకు హాజరుకండి

యల్లనూరు: తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విభాగానికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు హాజరు కావాలని తహసీల్దారు రాము ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. అధికారులు సమయపాలన పాటించాలని సూచించారు.

ఘనంగా మహాలయ పౌర్ణమి వేడుకలు


మటన్ షాపు వద్ద బారులు తీరిన జనాలు

గుత్తి: గుత్తి, గుత్తి ఆర్‌ఎస్‌లలో ఆదివారం మహాలయ పౌర్ణమి (మాల పున్నం) వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మటన్, చికెన్ దుకాణాలు మాంసం ప్రియులతో కిక్కిరిసిపోయాయి. తెల్లవారు జాము నుంచే మటన్, చికెన్ దుకాణాల వద్ద జనాలు బారులు తీరారు. మాంసం, చికెన్ ప్రియులు భారీగా రావడంతో చికెన్, మటన్ విక్రయదారులు అమాంతం ధరలను పెంచేశారు. సాధారణ రోజుల్లో కిలో చికెన్ రూ. 180 ఉండేది. అయితే ఆదివారం కిలో రూ. 220 నుంచి రూ.250కు, మటన్ కిలో రూ.700 నుంచి రూ.750 కు పెంచేశారు. దీంతో మాంసం ప్రియులు ఇబ్బందులు పడ్డారు.

చంద్ర గ్రహణం ఎఫెక్టు.. ఆలయాల మూసివేత


మూసివేసిన ఆలూరు కోన రంగనాథస్వామి ఆలయం


బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయానికి తాళం వేసిన అర్చకులు


చింతల వెంకటరమణస్వామి ఆలయాన్ని మూసేసిన దృశ్యం

తాడిపత్రిటౌన్/తాడిపత్రి రూరల్/బుక్కరాయసముద్రం: చంద్ర గ్రహణం కారణంగా తాడిపత్రి మండలంలో ఆదివారం పలు ఆలయాలను మూసివేశారు. మండలంలోని ఆలూరు కోన రంగనాథస్వామి, ఓబులేసు లక్ష్మీనరసింహస్వామి, ఇగుడూరు గంగమ్మ ఆలయాలకు మధ్యాహ్నం 1 గంట నుంచి తాళం వేశారు. అంతకుముందు ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పట్టణంలోని ప్రసిద్ధి క్షేత్రాలైన పార్వతీసమేత బుగ్గ రామలింగేశ్వరస్వామి, భూదేవి, శ్రీదేవి సమేత చింతల వెంకటరమణస్వామి దేవాలయాలకు అర్చకులు తాళాలు వేశారు. పట్టణంలోని ఏటిగడ్డ అంజినేయస్వామి ఆలయం, పుట్లూరురోడ్డు లోని ఆంజనేయస్వామి ఆలయం, మెయిన్ బజార్‌లోని కన్యకాపరమేశ్వరీమాత ఆలయం, యల్లనూరురోడ్డు, గానుగ వీధిలోని చౌడేశ్వరీదేవి ఆలయాలు, ఆర్టీసీ బస్టాండ్‌సర్కిల్ వద్ద ఉన్న సీతారామ దేవాలయం, కడప రోడ్డులోని కాశీవిశ్వేరస్వామి దేవాలయంతో పాటు పలుదేవాలయాలను అర్చకులు మూసివేశారు. సోమవారం ఉదయం 7 గంటలకు శాస్త్రోక్తంగా ఆలయ శుద్ధి అనంతరం ఆలయాలు తెరుచుకుంటాయని ఈఓ రామాంజనేయులు తెలిపారు.

- బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని కొండమీద రాయుని దేవాలయం, ముసలమ్మ కట్ట వద్ద ఉన్న కాశీ విశ్వేశ్వర ఆలయాలను ఆదివారం చంద్ర గ్రహణం సందర్భంగా రాత్రి 9.56 గంటలకు మూసివేస్తున్నట్లు అర్చకులు శ్రీనాథ్ స్వామి, అన్నామలై స్వామి తెలిపారు. సోమవారం ఉదయం ఆలయాలు శుద్ధి చేసి యథావిధిగా పూజలు ప్రారంభిస్తామన్నారు.